సాక్షి
కుమురం భీం

మంగళవారం । 2 జనవరి । 2024



ట్రిపుల్.. ట్రబుల్స్ తీరేనా..?
ఆంక్షల పేరుతో బాసర ట్రిపుల్ ఐటీలోకి ఎవరినీ అనుమతించడం లేదు. కొత్త సీఎం హయాంలో సమస్యలు పరిష్కారమవుతాయని విద్యార్థులు ఆశిస్తున్నారు. 8లో▸



యెల్లో చిల్లీ.. సిరుల వల్లి
దహెగాంలో రఘోత్తంరెడ్డి పసుపు రంగు మిర్చి పంట సాగు చేస్తున్నాడు. మార్కెట్‌లో క్వింటాల్ ధర రూ.40 పైనే ఉంటుందని అధికారులు చెబుతున్నారు. 10లో▸

గరిష్టం/కనిష్టం
28.2 /15.4

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. చలి ప్రభావం కాస్త తగ్గుతుంది. ఉదయం పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

పదోన్నతితో మరింత బాధ్యత

ఆసిఫాబాద్: పదోన్నతితో ఉద్యోగుల్లో మరింత బాధ్యత పెరుగుతుందని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. ఇటీవల హెడ్ కానిస్టేబుల్ నుంచి ఏఎస్సైగా పదోన్నతి పొందిన బి.రమేశ్, కె.అనిల్ కుమార్, కె.చంద్ర శేఖర్, ఎ.సాయిబాబా, జమాల్ అహ్మద్, కె.వేణుగోపాల్‌కు సోమవారం జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో స్టార్ తొడిగి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు శాఖలో పదోన్నతి ద్వారా స్థాయితో పాటు బాధ్యత పెరుగుతుందన్నారు. క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ ప్రజల్లో పోలీసు శాఖపై నమ్మకం, గౌరవాన్ని పెంచాలన్నారు.

వాంకిడి ఏఎస్సైకి ఉత్తమ సేవా పతకం



జి.పోశెట్టి

కెరమెరి(ఆసిఫాబాద్): నూతన సంవత్సరం సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన పోలీసులకు సోమవారం రాష్ట్ర ప్రభుత్వం సేవా పతకాలు ప్రకటించింది. వాంకిడి పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా పనిచేస్తున్న గంజేవార్ పోశెట్టికి ఉత్తమ సేవా పతకానికి ఎంపికయ్యారు. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం మందాగడ గ్రామానికి చెందిన పోశెట్టి 1989లో పోలీస్‌శాఖలో చేరారు. ఆయన చెన్నూర్, ఉట్నూర్, జైనథ్, తలమడుగు పీఎస్‌ల్లో పనిచేశారు. 2013లో హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందారు. 2018లో సేవా పతకం సాధించిన ఆయన.. 2020లో ఏఎస్సైగా పదోన్నతి పొందారు. 2022 నుంచి వాంకిడి పీఎస్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. 35 ఏళ్ల సర్వీసులో క్రమశిక్షణ, బాధ్యతతో పని చేసినందుకు ఈ గౌరవం దక్కినట్లు భావిస్తున్నానని పోశెట్టి తెలిపారు.

కొత్త ఓసీపీల ఏర్పాటుకు కసరత్తు

రెబ్బెన(ఆసిఫాబాద్): కొత్త సంవత్సరంలో బెల్లంపల్లి ఏరియాలో కొత్త ఓసీపీల ఏర్పాటుకు ముమ్మరంగా కసరత్తు చేస్తామని జీఎం రవిప్రసాద్ అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో డిసెంబర్‌లో ఏరియా సాధించిన బొగ్గు ఉత్పత్తి వివరాలను వెల్లడించారు. డిసెంబర్‌లో ఏరియాకు 2.75 లక్షల టన్నుల లక్ష్యాన్ని నిర్దేశించగా.. 3.83 లక్షల టన్నులు సాధించి 139 శాతం ఉత్పత్తిని నమోదు చేశామన్నారు. వార్షిక ఉత్పత్తి సాధనలో డిసెంబర్ వరకు 21.75 లక్షల టన్నుల లక్ష్యానికి 28.40 లక్షల టన్నుల ఉత్పత్తిని సాధించగలిగామని పేర్కొన్నారు. రోజుకు 10వేల టన్నుల చొప్పున ఉత్పత్తిని సాధించినా.. వార్షిక లక్ష్యాన్ని నిర్దేశించిన సమయం కంటే ముందే చేరుకుంటామని తెలిపారు. ప్రస్తుతం ఏరియాలో రోజుకు 12వేల టన్నుల వరకు ఉత్పత్తి సాధిస్తున్నామన్నారు. గోలేటి ఓసీపీ ఏర్పాటుకు అటవీశాఖ అనుమతుల కోసం ముమ్మరంగా ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. మాదారం ఓసీపీ కోసం సైతం అన్ని ప్రయత్నాలు సాగిస్తున్నామని తెలిపారు. ఆర్అండ్ఆర్ సెంటర్ల ఏర్పాటు కోసం స్థలాల సేకరణ పనులు సాగుతున్నాయని తెలిపారు. ఎస్‌వోటూజీఎం నరేందర్, ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహెరా, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పీవోలు ప్రశాంత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నూతన లక్ష్యాలు నిర్దేశించుకోవాలి



న్యూ ఇయర్ వేడుకల్లో పాల్గొన్న ఎస్పీ సురేశ్‌కుమార్, పోలీసులు

ఆసిఫాబాద్: కొత్త సంవత్సరంలో నూతన లక్ష్యాలు నిర్దేశించుకుని పని చేయాలని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో సోమవారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ పోలీసులతో కలిసి కేక్ కట్ చేసి, జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గడిచిన సంవత్సరం పోలీసుశాఖకు ఎన్నో నూతన సాంకేతికతను అందించడమే కాకుండా సిబ్బంది పూర్తిస్థాయి విధి నిర్వహణకు దోహదపడిందన్నారు. బేసిక్ పోలీసింగ్ విధానాన్ని అవలంబిస్తూ ప్రజలకు పోలీసులు చేరువ కావాలని సూచించారు. అధికారులు, సిబ్బంది వ్యక్తిగత, వృత్తిపరంగా నూతన లక్ష్యాలు నిర్దేశించుకుని పనిచేయాలన్నారు. ఆరోగ్యం విషయంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించడంలో కృషి చేసిన వారికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలకు కూడా సన్నద్ధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీలు ఎం.వెంకటరమణ, కరుణాకర్, డీసీఆర్‌బీ డీఎస్పీ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.50 లక్షలు భోంచేశారు!



అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పీటీజీ పాఠశాలలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో భోజనాలు చేస్తున్న ఎన్నికల సిబ్బంది(ఫైల్)

- ఈవీఎంల తరలింపు రోజు రూ.25 లక్షలు..
- ఓట్ల లెక్కింపు రోజు సుమారు రూ.10 లక్షలు
- అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అంచనాలకు మించి ఖర్చు చేసినట్లు లెక్కలు
- కలెక్టరేట్ ముఖ్య అధికారి కనుసన్నల్లోనే స్కాం..!
- కాంట్రాక్టు అవతారమెత్తిన ఆయన అనుచరులు
- ప్రభుత్వ ఉద్యోగికి టెండరు లేకుండా రూ.90 లక్షల పనులు
- సీసీల నియామకం వెనుకా.. ఈ అధికారిదే కీలక పాత్ర

సాక్షి, ఆసిఫాబాద్: అనధికార సహాయకుల సాక్షిగా కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సమీకృత కార్యాలయంలో అక్రమాలు రాజ్యమేలుతున్నాయి. 'తిలా పాపం తలా పిడికెడు' అన్నట్లుగా అక్కడ పనిచేసే ఓ ముఖ్య అధికారి తీరుతో అవకతవకలకు అడ్డుకట్ట పడటం లేదు. పదేళ్లుగా ఒకే సీటులో పాతుకుపోయిన ఆ అధికారి.. తన అనుచరులు, సహోద్యోగులను అడ్డుపెట్టుకొని ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం ఆసిఫాబాద్ నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల విధుల్లో పాల్గొన్న సిబ్బంది భోజనానికి రూ.50 లక్షలు ఖర్చు పెట్టినట్లుగా లెక్కలు చూపారని సమాచారం. అలాగే ఈవీఎంలు పోలింగ్ కేంద్రాలకు తరలించిన రోజు.. ఓట్ల లెక్కింపు రోజు కూడా రూ.లక్షల్లో వ్యయం చూపారని తెలుస్తోంది. ప్రభుత్వం ప్రత్యేకంగా ఆడిట్ శాఖతో తనిఖీలు చేయించినప్పుడే ఇలాంటి అక్రమాలు వెలుగు చూస్తాయి.. కానీ ఎన్నికల ఖర్చుకు సంబంధించి ఎలాంటి ఆడిట్ లేకపోవడంతోనే ఈ కుంభకోణానికి తెరతీసినట్లు కలెక్టరేట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

అక్రమార్కులకు కొమ్ము కాస్తూ..

అక్రమార్కులపై కొరడా ఝళిపించాల్సిన జిల్లా ఉన్నతాధికారే వారికి కొమ్ము కాస్తుండటంతో కలెక్టరేట్‌లో ఓ ముఖ్య అధికారి అవినీతి, అక్రమాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోందన్న ఆరోపణలు ఉన్నాయి. కలెక్టరేట్‌ను అంతా తానై నడిపిస్తున్న ఆ ముఖ్య అధికారి.. ఎలాంటి నియామక ఉత్తర్వులు లేకపోయినా.. అర్హత లేకపోయినా తన అనుచరులకు కలెక్టరేట్‌లో కీలకమైన సీసీ పోస్టుల్లో నియమించారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. అనధికారికంగా ఓ ఎలక్ట్రీషియన్‌ను సైతం నియమించడం.. అతడిని అడ్డుపెట్టుకుని రూ.లక్షలు ఆర్జించినట్లు సమాచారం. కలెక్టరేట్‌లో జరిగే ప్రతి ఫంక్షన్‌కు ఆ ఎలక్ట్రీషియన్ ఆధ్వర్యంలోనే ఏర్పాట్లు చేయడం.. రూ.వేలల్లో అయ్యే ఖర్చును రూ.లక్షల్లో చూపి బిల్లులు దండుకోవడం పరిపాటిగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవ సందర్భంగా భవనాన్ని విద్యుత్ బల్బులతో పది రోజులపాటు అలంకరించిన సంగతి తెలిసిందే. ఇందుకు రూ.10 లక్షలు బిల్లులు పెట్టినట్లు సమాచారం. వాస్తవానికి ఆ అలంకరణకు అయ్యే సామగ్రినే ఆ డబ్బుతో కొనుగోలు చేయవచ్చు. కానీ అలా చేయకుండా ఎలక్ట్రీషియన్‌కు ఆ పనులు అప్పగించి నిధులు దోచేయడం వెనుక ముఖ్య అధికారి ప్రధాన పాత్ర వహించినట్లు తెలుస్తోంది. తాజాగా ఎన్నికల విధుల్లో భాగంగా ఆ ఎలక్ట్రీషియన్ అంశంలోనూ ఆ అధికారి చక్రం తిప్పినట్లు తెలుస్తోంది. ఎన్నికల ముందు రోజు కలెక్టరేట్ పక్కనే ఉన్న గిరిజన పాఠశాలలో ఈవీఎంల తరలించడానికి అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ఆ రోజు ఎన్నికల విధుల్లో పాల్గొనేందుకు జిల్లా నలుమూలల నుంచి వచ్చే ఉద్యోగులతోపాటు, పోలీసులకు అక్కడ టెంట్లు వేసి, భోజన ఏర్పాట్లు చేశారు. ఈవీఎంలను మధ్యాహ్నం అక్కడి నుంచి తరలించారు. ఇందుకోసం అక్కడికి వచ్చిన పోలీసులు, ఎన్నికల సిబ్బందికి దాదాపు రూ.25 లక్షలు ఖర్చు అయినట్లుగా లెక్కలు చూపినట్లు తెలుస్తోంది. ఈ పనులు సైతం ఎలక్ట్రీషియన్ చేపట్టడం విశేషం.

గతేడాది చివర జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఆసిఫాబాద్ నియోజకవర్గానికి సంబంధించి విధులు నిర్వర్తించిన ఎన్నికల సిబ్బంది భోజనాల కోసం జిల్లా యంత్రాంగం ఖర్చు చేసిన మొత్తం అక్షరాలా రూ.50 లక్షలు. తాగునీటికి పెట్టిన ఖర్చు సుమారు రూ.10 లక్షలు. ఇది ఇప్పటిదాకా హోటల్ యజమానులకు చెల్లించాల్సిన మొత్తం బిల్లు వివరాలు. ఈ బిల్లులో ఇప్పటికే కొంత సొమ్ము చెల్లించగా.. మిగిలిన సొమ్ము సర్కారు నుంచి విడుదలై వచ్చిన తర్వాత చెల్లిస్తామని కలెక్టరేట్‌లో పనిచేసే ఓ ముఖ్య అధికారి చెబుతున్నట్లు సమాచారం. వాస్తవానికి ఎన్నికల విధుల్లో పాల్గొన్న అధికారులు, సిబ్బంది భోజనానికి ఇన్నేసి లక్షల రూపాయలు ఖర్చయ్యే అవకాశం లేదు. కానీ లెక్కలకు ఎలాంటి ఆడిట్ లేకపోవడంతో తూతూ మంత్రంగా లెక్కలు రూపొందించిన అధికారులు ప్రభుత్వం కళ్లకు గంతలు కట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమార్కులు దోచుకుంటున్న సొమ్ములో అధిక వాటా ముఖ్యఅధికారికి ముట్టజెప్పుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కాంట్రాక్టర్ అవతారమెత్తిన ఖజానా ఉద్యోగి..
సాధారణంగా ప్రైవేటు వ్యక్తులు కాంట్రాక్టరు పనులు చేపడుతుంటారు. వీరు ప్రభుత్వం వివిధ పనుల చేపట్టేందుకు పిలిచే టెండర్లలో పాల్గొని, తక్కువ ధరకు టెండర్ కోట్ చేసి ఆయా పనులు దక్కించుకుంటుంటారు. కానీ ఆసిఫాబాద్ కలెక్టరేట్‌లో మాత్రం ఇక్కడ పనిచేసే ఓ ఉద్యోగి కాంట్రాక్టర్ అవతారం ఎత్తి అక్రమార్గంలో ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. కలెక్టరేట్‌లో ముఖ్యమైన ఖజానా విభాగంలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి ఇటీవల జరిగిన ఎన్నికలకు సంబంధించి రెండు పనులనూ కాంట్రాక్టర్ ముసుగులో చేపట్టి రూ.లక్షలు దండుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇతను ముఖ్య అధికారి ఇద్దరూ కీలక విభాగాల్లో ఉండటంతో ఒకరికొకరు సహాయసాకారాలు అందించుకున్నట్లు సమాచారం. ఇప్పటికే ట్రెజరీ ఉద్యోగి తన క్రెడెన్షియల్స్‌ను ముఖ్య అధికారికి చేరవేయగా.. అందుకు ప్రతిఫలంగా ఎన్జీవో కాలనీలో ఓ ప్లాట్‌ను ఇప్పించారనే ఆరోపణలు ఉన్నాయి. తాజాగా ఓట్ల లెక్కింపు రోజున కౌంటింగ్ హాల్ లోపలా, వెలుపలా చేసిన ఏర్పాట్లు చేసే కాంట్రాక్ట్‌ను సదరు ట్రెజరీ ఉద్యోగే చేపట్టడం గమనార్హం. ఇందుకు సుమారు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు బిల్లులు సమర్పించినట్లు సమాచారం.

టెండరు లేకుండా రూ.90 లక్షల పనులు..



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

ట్రెజరీ ఉద్యోగే ప్రస్తుతం కలెక్టరేట్‌లో చేపట్టిన సీసీ కెమెరాల పనులను సైతం ట్రెజరీ ఉద్యోగే తన బంధువు పేరిట దక్కించుకున్నట్లు తెలుస్తోంది. ఎలాంటి టెండరు లేకుండానే కలెక్టరేట్‌లో పనిచేస్తున్న ఓ సీసీ, ఇద్దరు ముఖ్య అధికారులు చక్రం తిప్పి ఈ పనిని ట్రెజరీ ఉద్యోగికి అప్పగించినట్లు అప్పగించినట్లు సమాచారం. రూ.90 లక్షలు విలువ చేసే ఈ ముఖ్యమైన పనిని సైతం టెండరు లేకుండా ఇవ్వడం వెనుక ప్రజాధనం లూటీయే లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. వాస్తవానికి ఈ పనులను కలెక్టరేట్‌లో ఉండే ఈ–డిస్ట్రిక్ మేనేజర్(ఈడీఎం) ఆధ్వర్యంలో చేపట్టాల్సి ఉంటుంది. కానీ, ఈ పనులు చేపడుతున్న విషయం సదరు అధికారికి తెలియకపోవడం విడ్డూరం. ఇదే విషయాన్ని 'సాక్షి' ఈడీఎం గౌతంరాజును ఫోన్‌లో సంప్రదించగా.. 'సీసీ కెమెరాలు బిగిస్తున్న విషయం నాకు ఈ మధ్యే తెలిసింది. అయితే ఆ పనులు ఎవరు చేపట్టారు? టెండరు ద్వారా పనులు దక్కాయా? లేదా? అనే వివరాలు తెలియవు..' అని సమాధానం ఇచ్చారు.

స్కిల్ సెంటర్‌ను వినియోగించుకోవాలి

- ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు



స్కిల్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, తదితరులు

కాగజ్‌నగర్‌టౌన్: కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ప్రధాన మంత్రి కౌశల్ విజ్ఞాన్ యోజన స్కిల్ సెంటర్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో సోమవారం స్కిల్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం స్కిల్ సెంటర్ల ద్వారా ఒక్కో అభ్యర్థిపై దాదాపు రూ.20వేలు ఖర్చు చేస్తుందని తెలిపారు. ఈ కేంద్రాలను ఉపయోగించుకుని ఉపాధి మార్గాలు అన్వేషించుకోవాలన్నారు. అంతకు ముందు జవహర్ నవోదయ విద్యార్థులతో కలిసి నూతన సంవత్సర వేడుకలు జరుపుకొన్నారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ చక్రపాణి, రామయ్య, అనిల్, నాయకులు సత్యనారాయణ, వీరభద్ర చారి, గోలెం వెంకటేశ్, ముత్తు అశోక్, పారుపల్లి రాణి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

సంబురంగా న్యూ ఇయర్ వేడుకలు



కలెక్టర్ హేమంత్ బోర్కడేకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్: జిల్లా వ్యాప్తంగా న్యూ ఇయర్ వేడుకలు సోమవారం సంబురంగా సాగాయి. తెల్లవారుజాము నుంచే మహిళలు ఇళ్ల ముంగిట రంగురంగుల ముగ్గులు వేశారు. అర్ధరాత్రి నుంచే సెల్‌ఫోన్లు, సోషల్ మీడియా ద్వారా మిత్రులు, బంధువులకు కొత్త సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకున్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. జిల్లా కేంద్రంలో షిర్డీ సాయి మందిర్, శివకేశవ మందిర్, కేశవనాథ ఆలయం, బాలేశ్వర మందిరం, కేస్లాపూర్ హనుమాన్ మందిర్‌లో భక్తులు రద్దీ కనిపించింది. సాయి మందిరంలో మధ్యాహ్న హారతికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కలెక్టర్ హేమంత్ బోర్కడేను ఎమ్మెల్యే కోవ లక్ష్మి, సిర్పూర్(యూ) జెడ్పీటీసీ కోవ అరుణ క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. 2024 సంవత్సరంలో జిల్లా ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కలెక్టర్ ఆకాంక్షించారు. జిల్లాలోని చర్చీల్లో పాస్టర్లు, క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జిల్లా కేంద్రంలోని దస్నాపూర్‌లోని న్యూలైఫ్ ఏజీ చర్చిలో ఎంపీపీ అరిగెల మల్లికార్జున్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, పాస్టర్ కరుణకుమార్‌తో కలిసి కేక్ కట్ చేశారు. కుమురంభీం ప్రాజెక్టు ప్రాంతం పర్యాటకులతో సందడిగా మారింది.



జిల్లా కేంద్రంలోని సాయి మందిరంలో భక్తుల రద్దీ

అభివృద్ధికి అటవీ అడ్డంకి!



వాంకిడి మండలం ఖమన గ్రామం నుంచి సర్కెపల్లి గ్రామం వరకు 9 కిలోమీటర్ల రోడ్డుకు రూ.7 కోట్లు మంజూరయ్యాయి. ఆరు కిలోమీటర్ల రోడ్డు పూర్తికాగా, మరో మూడు కిలో మీటర్ల మేర నిర్మించాల్సి ఉంది. అటవీ శాఖ నుంచి అనుమతులు మంజూరు కాకపోవడంతో పనులు ఆగిపోయాయి. ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు.

- అటవీశాఖ అనుమతుల్లేక ఏళ్లుగా నిలిచిన రహదారి పనులు
- అభివృద్ధికి దూరంగా పల్లెలు
- ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక రాకపోకలకు అవస్థలు
- 'మహాలక్ష్మి' పథకానికి దూరమవుతున్న మహిళలు
- కొత్త ప్రభుత్వం దృష్టి సారిస్తేనే మేలు

బెజ్జూర్(సిర్పూర్): అటవీశాఖ అనుమతులు లేక రహదారి పనులకు మోక్షం కలగడం లేదు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైనా.. ఏళ్లుగా పనులు ముందుకు సాగడం లేదు. ఫలితంగా గ్రామాలకు రోడ్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సరైన రోడ్లు లేవనే కారణంతో ఆర్టీసీ జిల్లాలోని అనేక పల్లెలకు బస్సు సర్వీసులు ప్రారంభించకపోవడంతో మహాలక్ష్మి పథకానికి మహిళలు దూరమవుతున్నారు.

జిల్లాలో పరిస్థితి..
జిల్లాలోని 15 మండలాల పరిధిలో 335 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గతంలో ప్రభుత్వం ఆయా మండలాల్లోని మారుమూల గ్రామాలకు రోడ్లు నిర్మించేందుకు నిధులు మంజూరు చేసింది. అయితే అటవీశాఖ నుంచి అనుమతులు రాకపోవడంతో చాలా వరకు ప్రారంభం కాలేదు. గ్రామాల నుంచి మండల కేంద్రాలు, జిల్లా కేంద్రానికి చేరుకునేందుకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. కొన్నిచోట్ల అంబులెన్స్‌లు కూడా వెళ్లలేని పరిస్థితి ఉందంటే అతిశయోక్తి కాదు. వాగులు, ఒర్రెలు అధికంగా ఉన్న సిర్పూర్ నియోజకవర్గంలో ఈ పరిస్థితి అధికంగా ఉంది.



నిర్మాణానికి నోచుకోని బెజ్జూర్ నుంచి సోమినికి వెళ్లే రోడ్డు

- బెజ్జూర్ మండలంలో రోడ్డు, వంతెనల అభివృద్ధి కోసం 2018 సంవత్సరంలో రూ.8 కోట్లు మంజూరయ్యాయి. బెజ్జూర్ నుంచి సోమిని, సోమిని నుంచి గూడెం వరకు ఈ అభివృద్ధి పనులు జరగాల్సి ఉంది. అటవీ శాఖ అనుమతులు లేక ప్రారంభానికి నోచుకోవడం లేదు. అనుమతుల్లో జాప్యం జరగడంతో నిధులు వెనక్కి వెళ్లిపోయే ప్రమాదం ఉంది.
- పెంచికల్‌పేట్ మండలం అగర్‌గూడ నుంచి కమ్మర్‌గాం, అగర్‌గూడ నుంచి బెజ్జూర్ మండలంలోని హేటిగూడ వరకు రోడ్డు నిర్మాణానికి నాలుగేళ్ల క్రితం రూ.3 కోట్ల నిధులు మంజూరైనా పనులు ప్రారంభం కాలేదు.
- దహెగాం మండలం కర్జి రాంపూర్, అలాగే కుంచవెల్లి నుంచి కల్వాడ వరకు రహదారుల అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరైనా పనులు ముందుకు సాగని దుస్థితి.
- సిర్పూర్(టి) మండల కేంద్రం నుంచి మాలిని వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. పనులు మాత్రం ముందుకు సాగడం లేదు.
- చింతలమానెపల్లి మండలంలోని దిందా వాగుపై వంతెన నిర్మాణం సైతం అటవీ శాఖ అనుమతులు లేకపోవడంతో ఆగిపోయింది.
- జైనూర్ మండలం డబోలి గ్రామం నుంచి జాడగూడ, లొద్దిగూడ ఐదు కిలోమీటర్ల వరకు మంజూరైన రోడ్డు అనుమతులు లేక నిలిచిపోయింది.
- కౌటాల మండలంలోని శీర్షా చౌరస్తా నుంచి కనికి గ్రామం వరకు రోడ్డు కోసం నిధులు మంజూరయ్యాయి. అటవీ శాఖ అనుమతులు లేక పనులు ఆగిపోయాయి.

పల్లెలకు చేరని 'ఆర్టీసీ'
నూతన ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించింది. కానీ జిల్లాలో ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోలేని దుస్థితి నెలకొంది. రోడ్డు సౌకర్యం లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు నడపడం లేదు. ఇలా సిర్పూర్ నియోజకవర్గంలో దాదాపు 70 గ్రామాల వరకు ఉన్నాయి. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ప్రయాణికులు బస్సు సౌకర్యం లేకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బస్సు కూడా రాదు



రోడ్లు, వంతెనల నిర్మాణం నిధులు మంజూరైనా ఇప్పటివరకు పనులు మాత్రం ప్రారంభం కాలేదు. రోడ్డు సక్రమంగా లేకపోవడంతో కనీసం బస్సులు కూడా రాలేని దుస్థితి. మండల కేంద్రానికి వెళ్లాలన్నా ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

– జాడి లక్ష్మణ్, సోమిని, మం.బెజ్జూర్

అత్యవసరంలో అవస్థలే..



రోడ్డు సౌకర్యం లేకపోవడంతో అత్యవసర సమయంలో అవస్థలు తప్పడం లేదు. ముఖ్యంగా వర్షాకాలంలో రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. వాగులు ఉప్పొంగితే దాటలేని పరిస్థితి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యలు పరిష్కరించాలి.

– పోర్తెట్టి శివరాం, సోమిని, మం. బెజ్జూర్

క్లుప్తంగా

ఆరుగురిపై కేసు

జన్నారం: మండలంలోని తపాలపూర్‌కు చెందిన జెల్ల భీమయ్య ఇంటి ద్వారాన్ని పగుల గొట్టి చంపుతానని బెదిరించిన ఆరుగురిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై బిక్‌లాల్ తెలిపారు. భీమయ్య ఫిర్యాదుతో నల్ల విజయ్‌కుమార్, వినయ్‌కుమార్, కవిత, శ్రీనివాసరెడ్డి, సరళ, సురేఖపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

ఇద్దరి మృతికి కారణమైన డ్రైవర్‌పై కేసు

కాసిపేట: డ్రైవర్ అజాగ్రత్తతో వాహనం నడిపి ఇద్దరి మృతికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గంగారాం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నస్పూర్‌కు చెందిన వేల్పుల రవీందర్ భార్య నిర్మల, కూతురు స్వాతి ఆదివారం రాత్రి సోమగూడెం సమీపంలోని కల్వరి చర్చిలో ప్రార్థనలకు వెళ్లేందుకు రోడ్డు దాటుతున్నారు. మహారాష్ట్రకు చెందిన డ్రైవర్ ఉరాడే భరత్ తన గూడ్స్ క్యారియర్ వాహనాన్ని అజాగ్రత్తగా వేగంగా నడుపుతూ వారిని ఢీకొట్టారు. తీవ్రగాయాలైన వారిని బెల్లంపల్లి ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందారు. భర్త రవీందర్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని యాపల్ ప్రాంతంలో జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై చంద్రకుమార్ కథనం ప్రకారం.. బెల్లంపల్లి పట్టణానికి చెందిన కోటేశ్ మందమర్రి ఏరియాలోని కేకే-ఓసీలో క్లర్క్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఎప్పటిలాగా ఉదయం పని నిమిత్తం బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో మందమర్రిలోని ఇందిరానగర్‌కు చెందిన మహేశ్ బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఇద్దరికి గాయాలయ్యాయి. వీరిని 108 అంబులెన్స్‌లో మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచనలతో కోటేశ్‌ను కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కోటపల్లిలో చిరుత సంచారం


ఆయిల్‌పాం తోటలో చిరుత పాదముద్రలు

కోటపల్లి: మండల కేంద్రానికి అనుకుని ఉన్న ఎంపీపీ సురేఖ ఆయిల్‌పాం తోట సమీపంలో చిరుతపులి సంచారంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. చెన్నూర్ మండలం బుద్దారం, సంకారం మీదుగా ప్రయాణం చేసి కోటపల్లి నుంచి శంకరాపూర్ మీదుగా వెళ్లి ఉంటుందని అటవీ అధికారులు భావిస్తున్నారు. రైతు రామయ్య సమాచారం మేరకు ఆయిల్‌పాం తోటకి వెళ్లి చిరుత పాదముద్రలను గుర్తించారు. అటుగా మామిడి తోటలు, పత్తి చేన్లకు వెళ్లాలంటే రైతులు జంకుతున్నారు. అటవీ అధికారులు చిరుతను పట్టుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ట్రిపుల్.. ట్రబుల్స్ తీరేనా?

- సీఎంనే ఆనాడు రానివ్వలేదు
- ప్రధాన గేటు ముందే గవర్నర్ మీడియా సమావేశం
- ఎవరొచ్చినా లోపలకు నో ఎంట్రీ
- ప్రధాన ద్వారం వద్ద ఆంక్షలు
- తల్లిదండ్రులకు మాట్లాడే చాన్స్‌లేదు
- సీఎం రాక కోసం విద్యార్థుల ఎదురుచూపులు


బాసర ట్రిపుల్‌ఐటీ

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీ అంటే రాష్ట్రవ్యాప్తంగా అందరికీ తెలిసిందే.. ఇక్కడ చదివే పిల్లల ఇబ్బందులు, ఆందోళనలు, నిరసనలు ఇలా ఏదో ఒక విషయంలో ట్రిపుల్‌ఐటీ ఎప్పుడు వార్తల్లో నిలిచేది. బాసరలో 2008లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ట్రిపుల్‌ఐటీని ప్రారంభించారు. కొన్నేళ్లుగా ఇక్కడి విద్యార్థులు సమస్యల పరిష్కారానికి ఆందోళనలు చేపట్టారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు లేక సమస్యలు పరిష్కారం కాక ఇప్పటికీ అక్కడ చదివే విద్యార్థులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. బాసర ట్రిపుల్ ఐటీ రహస్య క్యాంపస్‌గా మారింది. మీడియాకు, విద్యార్థి సంఘాలకు, విద్యార్థుల తల్లిదండ్రులకు, మేధావులకు ఎవరైనా సరే లోపలికి అనుమతించడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు చదివే ఈ విశ్వవిద్యాలయంలో ఏమి జరుగుతుందోనని తెలియక పోషకులు ఆందోళనకు గురవుతున్నారు.

మీడియాకు నో ఎంట్రీ

2022 ఆగస్టు 7న బాసర ట్రిపుల్‌ఐటీకి గవర్నర్ హోదాలో తొలిసారి వచ్చిన తమిళిసై పర్యటన కవరేజీకి వెళ్లిన మీడియాను అధికారులు అనుమతించలేదు. ట్రిపుల్‌ఐటీ ప్రధాన ద్వారాన్ని మూసివేసి ఉంచారు. మీడియాతో పాటు ఉదయం వేళ ట్రిపుల్ ఐటీలో పనిచేసే సిబ్బందిని కూడా అనుమతించలేదు. గవర్నర్ బాసర ట్రిపుల్‌ఐటీ నుంచి నిజామాబాద్ తెలంగాణ యూనివర్సిటీకి వెళ్లే సమయంలో ప్రధాన ద్వారం వద్ద మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. అక్కడే మీడియాతో గవర్నర్ తమిళిసై మాట్లాడారు.

ఇప్పటికైనా మారేనా?

నాటి ప్రభుత్వంలో బాసర ట్రిపుల్‌ఐటీలో ఆంక్షల పేరుతో ఎవరిని అనుమతించలేదు. డిసెంబర్ 7న తెలంగాణ సీఎంగా పదవీ ప్రమాణం స్వీకారం చేసిన రేవంత్‌రెడ్డి ప్రగతి భవన్‌ను ప్రజాభవన్‌గా మార్చారు. ప్రజాభవన్‌గా మార్చి అక్కడే ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. బాసర ట్రిపుల్ ఐటీలో మాత్రం నేటికి పాత ఆంక్షలే కొనసాగిస్తున్నారు. విద్యార్థులకు సమస్యలు చెప్పుకునే అవకాశం కూడా కల్పించడం లేదు. సీఎం రేవంత్ రెడ్డి నేరుగా బాసర ట్రిపుల్ ఐటీకి వచ్చి సమస్యలు తెలుసుకుని శాశ్వత పరిష్కారానికి మార్గం చూపుతారని ఇక్కడి విద్యార్థులు ఆశగా ఎదురుచూస్తున్నారు.


2022 ఆగస్టు 7న ట్రిపుల్‌ఐటీ ప్రధాన ద్వారం వద్ద గవర్నర్ మీడియా సమావేశం (ఫైల్)

తీరిక లేక..

విద్యార్థులకు ప్రతీరోజు క్రీడలు ఆడుకునేలా షెడ్యూల్ ఉంచాలి. ఉదయం నిద్రలేవగానే రాత్రి పడుకునే వరకు స్నానాలు, భోజనాలు, తరగతి గదులు వీటితోనే రోజు పూర్తి అవుతుంది. క్రీడల్లో ఉన్న విద్యార్థులు మానసిక ఒత్తిడికి కాస్త దూరమవుతారు. వారంలో ఒక్కరోజైన చెవులకు ఇంపైనా సంగీతం, వినోద కార్యక్రమాలు తిలకించే ఏర్పాట్లు చేయాలి. అవేవి ఇక్కడ జరగడం లేదు. విద్యార్థుల పరిస్థితిపై ఎప్పటికప్పుడు సైకాలజిస్టులతో కౌన్సెలింగ్‌లు ఇప్పిస్తూ మానసికస్థితిని తెలుసుకోవాలి. ఒంటరిగా ఉండే విద్యార్థులను గుర్తించి వారి తల్లిదండ్రులను పిలిచి గతంలో ఎలా ఉండేవారు. ఇప్పుడు ఎందుకు ఇలా ప్రవర్తిస్తున్నారనే విషయాలను చర్చించాలి. ఇకనైనా విద్యార్థులపై శ్రద్ధ వహించాలని పలువురు కోరుతున్నారు.

నేటి సీఎంకు అప్పట్లో నో ఎంట్రీ...


2022 జూన్ 17న అప్పటి పీసీసీ చీఫ్ నేటి సీఎం రేవంత్‌రెడ్డి(ఫైల్)

నేటి సీఎం రేవంత్‌రెడ్డికే అప్పట్లో బాసర ట్రిపుల్‌ఐటీలో అనుమతించ లేదు. విద్యార్థుల సమస్యలు తెలుసుకునేందుకు గోడ దూకివచ్చిన పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. మళ్లీ గేటుద్వారా బయటకు పంపించారు. ప్రస్తుతం ఆయన సీఎంగా కొనసాగుతున్న నేపథ్యంలో ఈ సమస్య పరిష్కారం అవుతుందని విద్యార్థులు భావిస్తున్నారు.

జీఎంను కలిసిన పలువురు నేతలు

శ్రీరాంపూర్: నూతన సంవత్సరం పురస్కరించుకొని పలువురు యూనియన్ నేతలు శ్రీరాంపూర్ జీఎం బి.సంజీవరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. జీఎం కార్యాలయంలో సోమవారం ఆయన్ను ఏఐటీయూసీ అధ్యక్షుడు వి.సీతారామయ్య, డెప్యూటీ ప్రధాన కార్యదర్శులు కె.వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచి సెక్రెటరీలు ఎస్కే బాజీసైదా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో కంపెనీ మంచి వృద్ధిని సాధించాలని అదే క్రమంలో కార్మికుల సమస్యలన్నీ పరిష్కారం కావాలని నేతలు ఆకాంక్షించారు. కార్యక్రమంలో యూనియన్ బ్రాంచి ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య నాయకులు నర్సింగరావు, మురళీచౌదరి, అఫ్రోజ్‌ఖాన్, గండి సతీశ్, రాంచందర్ పాల్గొన్నారు.

ఐఎన్టీయూసీ నాయకులు..

ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచి ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, కేంద్ర ఉపాధ్యక్షులు కలవేన శ్యాం, గరిగే స్వామి తదితరులు జీఎం సంజీవరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. యూనియన్ జాతీయ సమితి సభ్యుడు భీంరావు, నాయకులు వెంగళ కుమారస్వామి, నీలం సదయ్య, ల్యాగల శ్రీనివాస్, నర్సింగ్, కాలువ శ్రీనివాస్ పాల్గొన్నారు.


జీఎం సంజీవరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఏఐటీయూసీ అధ్యక్షుడు వి.సీతారామయ్య

ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్..

సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జీఎం సంజీవరెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. డీజీఎం(ఐఈడీ) చిరంజీవులు , ఏరియా లైజన్ అధికారి కిరణ్‌కుమార్, అసోసియేషన్ బ్రాంచి ఉపాధ్యక్షుడు నీలబోయిన కుమార్, నాయకులు రాజేంద్రపాణి, పి.బాపయ్య, రాజేంద్రప్రసాద్, నవీన్, మల్లేశ్ పాల్గొన్నారు.

రాకేశ్‌కు అందుతున్న ఆర్థికసాయం

సాక్షి ఎఫెక్ట్..

భైంసాటౌన్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న రాకేశ్‌కు దాతల నుంచి ఆర్థికసాయం అందుతోంది. 'ఆపన్నహస్తం అందించరూ..'శీర్షికన 'సాక్షి'లో సోమవారం ప్రచురితమైన కథనానికి పలువురు స్పందిస్తున్నారు. జిల్లా నుంచే కాకుండా ఆదిలాబాద్‌తోపాటు అమెరికా, దుబాయ్ నుంచి సైతం పలువురు తమకు తోచిన ఆర్థికసాయాన్ని ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా అందిస్తున్నారు. రాకేశ్ స్నేహితులు సామాజిక మాధ్యమాల ద్వారా సాయం అందించాలని దాతలను కోరుతున్నారు. ఇప్పటివరకు దాతల నుంచి రూ.4.50 లక్షల ఆర్థికసాయం అందినట్లు తెలిపారు. ఆపరేషన్ కోసం రూ.8 లక్షల వరకు అవసరమని వైద్యులు పేర్కొన్నారని, దాతలు మరింత స్పందించి ఆదుకోవాలని కోరుతున్నారు.


ఆర్థికసాయం అందిస్తున్న తూమోల్ల దత్తాత్రి

ఆర్కే 5 గనిలో కార్మికుడికి గాయాలు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని ఆర్కే 5 గనిలో సపోర్టుమెన్ కార్మికుడు అంగడి సమ్మయ్యకు గాయాలయ్యాయి. మొదటి షిఫ్ట్ విధులకు హాజరైన సమ్మయ్య గని భూగర్భంలో విధులకు హాజరయ్యాడు. విత్‌డ్రాయింగ్ పనులు చేస్తున్నాడు. ఈక్రమంలో దిమ్మెలు తీస్తుండగా ఒక్కసారిగా పై నుంచి బండ కూలింది. బండ దిమ్మపై పడి తర్వాత అతనిపై పడటంతో కుడి భుజానికి గాయాలయ్యాయి. అతన్ని కార్మికులు రామకృష్ణపూర్‌లోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

'ఎల్లలు దాటిన మానవత్వం'

జన్నారం: మానవత్వం ఎల్లలు దాటింది. మండలంలోని కలమడుగు గ్రామానికి చెందిన బరుకుంట పోషన్న గత 12 ఏళ్ల క్రితం ఉపాధి నిమిత్తం సౌదీకి వెళ్లాడు. అక్కడ రియాజ్ మహ్మద్ సైఫ్‌కు చెందిన కంపెనీలో కార్మికుడిగా చేరాడు. గత ఆరునెలల క్రితం పోషన్న స్వగ్రామానికి వచ్చాడు. ఈక్రమంలో అనారోగ్యం బారినపడ్డాడు. వైద్యపరీక్షల్లో క్యాన్సర్ అని తేలింది. ఈ విషయం తెలియడంతో రియాజ్ మహ్మద్ సైఫ్ అతని వైద్యఖర్చుల కోసం డబ్బులు పంపించారు. సోమవారం ఆయన కలమడుగుకు వచ్చి పోషన్నను పరామర్శించారు. తర్వాత గ్రామంలోని మసీద్‌లో ప్రార్థనలు చేశారు. మసీద్ మరమ్మతుకు ఆర్థికసాయం అందజేస్తానని తెలిపారు. ముస్లింలకు అనాథ పిల్లలకు రూ.12 వేల నగదు అందించారు. ఈ సందర్భంగా సైఫ్‌ను సాక్షి పలుకరించగా, ఏళ్లుగా ఇంట్లో వ్యక్తిలా పనిచేసిన పోషన్నను పరామర్శించేందుకు ఇక్కడికి వచ్చానని తెలిపారు. మానవత్వం చాటిన సైఫ్‌ను గ్రామస్తులు అభినందించారు.


కలమడుగు గ్రామస్తులతో రియాజ్ మహ్మద్ సైఫ్

ఆదివాసీ పర్ధాన్ సమాజ్ అభివృద్ధికి పాటుపడాలి

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసీ పర్ధాన్ సమాజ్ అభివృద్ధికి పాటుపడాలని నాయకులు పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని పిట్టల్‌వాడలో గల ఆదివాసీ భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. విభేదాలు పక్కనపెట్టి అందరూ ఐక్యంగా ఉండాలన్నారు. అందులో భాగంగా మండల, డివిజన్ స్థాయి కమిటీలు నియమించాలన్నారు. ఫిబ్రవరిలో జరిగే హీరాసుక్కా జయంతి విజయవంతానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ఈనెల 7న బేల, జైనథ్, 9న తాంసి, తలమడుగు, 11న ఆదిలాబాద్, గుడిహత్నూర్, 12న భీంపూర్ మండలాల కమిటీలను ఎన్నుకుంటామన్నారు.సమావేశంలో ఆదివాసీ పర్ధాన్ సమాజ్ ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్, విజయ్, దేవిదాస్, రామాకాంత్, శివకృష్ణ పాల్గొన్నారు.


నూతనంగా ఎన్నికైన అడహక్ కమిటీ సభ్యులు

అడహక్ కమిటీ ఎన్నిక..

ఆదివాసీ పర్ధాన్ సమాజ్ అడహక్ కమిటీని ఎన్నుకున్నారు. సభ్యులుగా పూసం ఆనంద్‌రావ్, కుర్సేంగే తానాజీ, నైతం శుక్లాల్, పూసం ప్రభాకర్, గేడం మాధవ్, సెడ్మకి సుభాష్, గేడం విఠల్, మెస్రం ఈశ్వర్, మడావి దిగంబర్, మెస్రం భాస్కర్, ఆత్రం అనుసూయ, గంగాదేవి ఎన్నికయ్యారు.

కౌన్సిలర్‌ను అరెస్ట్ చేయాలి

ఆదిలాబాద్‌రూరల్: మావల మండల కేంద్రానికి చెందిన దళిత యువకుడు ఎంబడి వంశీ హత్యకు యత్నించిన పాల్పడిన కౌన్సిలర్ ఉష్కం రఘుపతి, ఉష్కం అరుంధతిలను అరెస్టు చేయాలని అంబేద్కర్ సంఘాల ఐక్యపోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని న్యూఅంబేద్కర్ భవనంలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. అన్ని దళిత కులాలతో కలిసి ఈనెల 3న కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. 6న ఆదిలాబాద్ పట్టణ బంద్‌కు పిలుపునిస్తామన్నారు. 8న మంత్రులు, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్లను కలిసి వినతిపత్రాలు అందిస్తామన్నారు. తాము చేపట్టే కార్యక్రమాలకు పోలీసులు సహకరించాలని కోరుతూ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి కలిసి వినతిపత్రం అందించారు. నిందితులను అరెస్ట్ చేస్తామని ఎస్పీ హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. సమావేశంలో భూమన్న, నవీన్, నగేశ్, ప్రశాంత్, చందాల రాజన్న, దయాకర్, దేవిదాస్, సత్యనారాయణ, సుదర్శన్, శంకర్, చిన్నయ్య, శోబతాయి పాల్గొన్నారు.


ఎస్పీకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

అ'పూర్వ' సమ్మేళనం


కేక్ కట్ చేస్తున్న పూర్వ విద్యార్థులు

స్థానిక కుంటాల ఉన్నత పాఠశాలలో 2002–03 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు 21 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. సోమవారం నిర్వహించిన అపూర్వ సమ్మేళనంలో పాల్గొని రోజంతా సంతోషంగా గడిపారు. న్యూఇయర్ వేడుకల సందర్భంగా కేక్ కట్ చేశారు. పాఠశాలలో జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. – కుంటాల

శ్రీరాంపూర్‌లో 81 శాతం ఉత్పత్తి

- జీఎం బి. సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో ఏప్రిల్ 1 నుంచి ఇప్పటివరకు నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యంలో 81 శాతం ఉత్పత్తిని సాధించినట్లు ఏరియా జీఎం బి.సంజీవరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉత్పత్తి వివరాలు, గత సంవత్సరం ఏరియా గనులు, సాధించిన ప్రగతిని వివరించారు. రెండు ఓసీపీల్లో ఓబీ టెండర్ సమస్యల వల్ల అనుకున్న బొగ్గు ఉత్పత్తి జరుగలేదన్నారు. భూగర్భ గనుల్లో 93 శాతం ఉత్పత్తి నమోదైందన్నారు. 2025–26 నాటికి ఎస్సార్పీ 1, ఆర్కే 6 గనులు మూతపడనున్నాయన్నారు. మిగిలిన ఆర్కే 5, ఆర్కే, ఐకే 1ఏ గనులు మరో ఐదేళ్ల వరకు బొగ్గు తీసే అవకాశం ఉందన్నారు. చెన్నూర్‌లో ఏర్పాటు చేస్తున్న 11 మెగావాట్ల సోలార్ ప్లాంట్ పనులు ఫిబ్రవరి నాటికి పూర్తవుతాయన్నారు. శ్రీరాంపూర్‌లో చెత్తశుద్ధి కోసం రూ.1.2 కోట్లతో ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. శ్రీరాంపూర్ డివిజన్‌లో ఎస్సార్పీ 1 గనిని 5 స్టార్ రేటింగ్ వచ్చిందన్నారు. గత సంవత్సరం శ్రీరాంపూర్‌లో 384 మందికి డిపెండెంట్ ఉద్యోగాలు కల్పించామన్నారు. 8201 మందికి ఇప్పటికి సీపీఆర్ఎంఎస్ కార్డులు ఇచ్చామన్నారు. సేవా సమితి ద్వారా పలు వృత్తి కోర్సుల్లో 473 మందికి శిక్షణ ఇస్తున్నామన్నారు. బెల్లంపల్లి రీజియన్‌లో గడిచిన 2022–23లో ఒక్క ప్రమాదం జరగకుండా యాక్సిడెంట్‌ఫ్రీ రీజియన్‌గా గుర్తింపు పొందిందన్నారు. సమావేశంలో ఎస్ఓటూజీఎం రఘుకుమార్, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవి, ఏజెంట్లు ఏవీరెడ్డి, రాముడు, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్ రెడ్డి, సీనియర్ పీవో కాంతారావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సంజీవరెడ్డి

ఎస్డీఎల్ ఉత్పత్తిలో ఆర్కే 6 అగ్రగామి..

అన్ని భూగర్భ గనుల్లో కెల్లా ఎస్డీఎల్ సెక్షన్‌లో ఉత్పత్తి సాధించిన ఆర్కే 6 గని అగ్రగామిగా నిలిచిందని గ్రూప్ ఏజెంట్ ఏ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం గనిపై జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు అధికారులు సూపర్‌వైజర్లు సమష్టితో రికార్డును నెలకొల్పామన్నారు. కొత్తగూడెంలో జరిగిన సింగరేణి ఆవిర్భావ వేడుకల్లో కంపెనీ గని అధికారులు అందుకున్న బహుమతిని కార్మికుల ముందు ప్రదర్శించారు. గని మేనేజర్ తిరుపతి, రక్షణ అధికారి కాదాసి శ్రీనివాస్, పిట్ ఇంజనీర్ శ్యాం, వెంటిలేషన్ అధికారి రాంనర్సయ్య,డెప్యూటీ మేనేజర్ కొమురయ్య ఉన్నారు.

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని భూగర్భ గనుల్లో బొగ్గు ఉత్పత్తి పెంచాలని జీఎం మనోహర్ పేర్కొన్నారు. జీఎం ఆఫీస్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఉత్పత్తి వివరాలను వెల్లడించారు. కేకే–5 గనిలో 18,939 టన్నులు, కాసిపేట గనిలో 14,558 టన్నులు, కాసిపేట–2 గనిలో 8,681 టన్నులు, శాంతిఖని గనిలో 6,014 టన్నులు, ఆర్కే ఓసీలో 176,259 టన్నులు, కేకే–ఓసీలో 162,751 టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగిందని వివరించారు. ఏరియాలో 118 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించిన ఆర్కే ఓసీ ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్వో టూ జీఎం రాజేశ్వర రెడ్డి, పర్సనల్ మేనేజర్ సల్ల శ్యాంసుందర్, ఐఈడీ రాజన్న కేకే–ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ రమేశ్, సీనియర్ పీవో ఆసీఫ్ పాల్గొన్నారు.

నరేంద్రాచార్య మహారాజ్‌ను కలిసిన ఎమ్మెల్యే


నరేంద్రాచార్య మహారాజ్‌తో రామారావుపటేల్

భైంసాటౌన్: నానిజ్‌ధామ్ దక్షిణ భారత్ పీఠాధిపతి నరేంద్రాచార్య మహారాజ్‌ను ముథోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్ కలిశారు. జుక్కల్‌లో సోమవారం నిర్వహించిన సమస్య మార్గదర్శన, దర్శన సమారోహ సందర్భంగా ఎమ్మెల్యే ఆయన్ను కలిసి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఆయన వెంట బీజేపీ నాయకులు పలువురు ఉన్నారు.

నాలుగేళ్ల బాబు కిడ్నీల్లో రాళ్లు

నిర్మల్: వయసుతో సంబంధం లేకుండా కిడ్నీలో రాళ్లు తయారవుతున్నాయి. కేవలం నాలుగేళ్ల చిన్న వయసులోనే ఓ బాబు రెండు కిడ్నీల్లో రాళ్లు కావడంతో నొప్పి భరించలేక కొన్ని రోజులుగా విలవిలలాడిపోయాడు. సోన్ మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన నాలుగేళ్ల బాబు కొంతకాలంగా కిడ్నీలో రాళ్లతో బాధపడుతున్నాడు. తెలిసిన వారి ద్వారా బాబును తీసుకుని తల్లిదండ్రులు జిల్లాకేంద్రంలోని డాక్టర్స్ లైన్‌లో గల స్వప్న హాస్పిటల్‌కు వచ్చారు. జనరల్ సర్జన్ శశికాంత్, కిడ్నీ వైద్య నిపుణుడు శ్రావణ్ బాబు రెండు కిడ్నీల్లో రాళ్లు ఉన్నట్లు గుర్తించి ఆపరేషన్ చేశారు. ప్రస్తుతం బాబు ఆరోగ్యంగా ఉన్నాడని వారు చెప్పారు. ఇలాంటి కిడ్నీ సంబంధిత వ్యాధులకు, కార్పొరేట్ స్థాయిలో నిర్మల్‌లోనే చికిత్స పొందవచ్చని వైద్యుడు శశికాంత్ చెప్పారు.

రెండు బైక్‌లు ఢీకొని ఒకరి మృతి


మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని రైల్వే ఫ్లెఓవర్ బ్రిడ్జిపై ఆదివారం రాత్రి ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందాడు. మరొకరికి స్వల్పగాయాలయ్యాయి. ఎస్సై రాజేందర్ కథనం ప్రకారం.. రాజస్థాన్ రాష్ట్రం జోదాపూర్ జిల్లా జటనీయా గ్రామానికి చెందిన హక్కారామ్(20), మరికొందరు కలిసి ఉపాధి నిమిత్తం నాలుగేళ్ల క్రితం మంచిర్యాలకు వచ్చారు. హక్కారామ్ కబోడ్ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఆదివారం సీసీసీలో పని ముగించుకున్నాడు. తెలిసిన వ్యక్తి బైక్‌ను తీసుకుని తనతో పనిచేసిన డుంగర్‌ను మంచిర్యాలలో దింపి తిరిగి వెళ్తున్నాడు. ఈక్రమంలో రాళ్లపేటకు చెందిన అన్వర్ వేగంగా వచ్చి బైక్ ఎదురెదురుగా ఢీకొంది. ఈ ప్రమాదంలో హక్కారామ్ తలకు తీవ్రంగా, అన్వర్‌కు స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ హక్కారామ్ మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


హక్కారామ్ (ఫైల్)

కమ్మేసిన పొగమంచు


లక్ష్మణచాంద: రాచాపూర్-మూటాపూర్ మార్గంలో..

లోకేశ్వరం మండలంలోని ధర్మోర, పంచగుడి, లోకేశ్వరం, వట్టోలి గ్రామాలు, లక్ష్మణచాంద మండలకేంద్రం, రోడ్డు మార్గాల్లో సోమవారం పొగమంచు కమ్మేసింది. పంట పొలాలు, రోడ్డు మార్గాల్లో దట్టమైన పొగ మంచు వల్ల వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఉదయం 8 గంటల వరకు పొగమంచు తగ్గలేదు.
– లోకేశ్వరం/ లక్ష్మణచాంద


లక్ష్మణచాంద సమీపంలో..


లోకేశ్వరంలో..